## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూర్యాపేట :** సూర్యాపేట పట్టణంలో విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టణంలోని శ్రీరామ్‌నగర్, దుర్గామాత సెంటర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సురేష్ శుక్రవారం తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కంఠమహేశ్వరుడికి పూజలు

**తుంగతుర్తి :** బండరామారంలో కంఠ మహేశ్వరస్వామి పండగకు శుక్రవారం ఏబీసీసీ సభ్యుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిటీ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, రేతినేని శ్రీనివాస్, దొంగరి గోవర్ధన్, మడ్డి కృష్ణమూర్తి, రాంబాబు, రాజు, గౌడ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

**అర్వపల్లి :** క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ కోరారు. అర్వపల్లిలోని పీహెచ్‌సీలో శుక్రవారం క్షయ నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20మందికి పరీక్షలు జరిపారు. ఎవరికైనా టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే సకాలంలో చికిత్స పొందితే నయమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమిస్తాం



శాంతి దీక్షలో పాల్గొన్న జర్నలిస్టులు

**సూర్యాపేట :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమాలను కొనసాగిస్తామని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాణిజ్య భవన్ సెంటర్‌లో నిర్వహించిన శాంతిదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి, సీనియర్ పాత్రికేయులు గుండా శ్రీనివాస్‌గుప్తా, బంటు కృష్ణ, భూపతి రాములు, వేణుమాధవ్, పి. సైదిరెడ్డి, తొలిదశ ఉద్యమకారులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, బచ్చు పురుషోత్తం, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కొండా శ్రీనివాస్, మల్లికార్జున్, పల్లె మణిబాబు, కొండ్లె కృష్ణయ్య, జలగం మల్లేష్, గట్టు అశోక్, శ్రీనివాస్, ఉయ్యాల నర్సయ్య, మామిడి రవి, దేవరగట్ల సతీష్, మామిడి శ్రవణ్, జహీర్, చంద్రశేఖర్, సుమన్, పాషా, వెంకట్, శంకర్, గౌసుద్దీన్, బాలు, చిరంజీవి, వెంకట్, సాయికృష్ణ, మధుసూదన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### కొండయ్య మృతికి సంతాపం

**పెన్‌పహాడ్ :** మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ల నాగార్జున తండ్రి కట్ల కొండయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒంటెద్దు నర్సింహారెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బిట్టు నాగేశ్వర్‌రావు, ఒంటెద్దు రాఘవరెడ్డి, మామిడి అంజయ్య, చిట్టెపు నారాయణరెడ్డి, దంతాల వెంకన్న, దండెంపల్లి సత్యనారాయణగౌడ్, పాంతటి మల్లారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విజయ్, వెంకటేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**నడిగూడెం :** పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని నడిగూడెం సింగిల్ విండో చైర్మన్ కొల్లు రామారావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంజపల్లి నాగేశ్వరరావు, అల్లు ప్రసాదరావు, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ రామారావు

# చివరి భూములకు అందని జలాలు

- వారబందీ విధానంతో రైతుల్లో అయోమయం
- నీటి సమస్య లేకుండా చూడాలని అన్నదాతల వేడుకోలు

**ఆత్మకూర్ (ఎస్) :** నాన్ ఆయకట్టు ప్రాంతమైన ఆత్మకూరు మండలంలో ప్రధానంగా వరి పంట సాగు అవుతుంది. రైతులు బోరు బావులు, చెరువులతోపాటు ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడి వరిని సాగు చేస్తున్నారు. మండలంలో గత రెండేళ్ల నుంచి మెట్ట, కూరగాయల పంటల సాగును తగ్గించి వరి సాగుకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎస్సారెస్పీ నీళ్ల సక్రమంగా రాకపోవడం, వారబందీ విధానంతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలకు వేలు ఖర్చుపెట్టి మెట్ట భూమిని సైతం వరి సాగుకు అనుకూలంగా చేసుకున్నామని, కానీ ఎస్సారెస్పీ నీళ్ల సక్రమంగా రాకపోవడంతో బీడులుగా వదిలి వేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. రెండు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.

**ఎవరూ పట్టించుకోక..**

ఎస్సారెస్పీ నీటిని వదిలినప్పటికీ అవి కొన్ని ప్రాంతాలకే పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కావాలనే ఎక్కువ మొత్తంలో నీటిని తరలించుకపోతుండడంతో చివరి భూముల రైతులకు నీరు అందడంలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో సాగు చేసిన పంటలను ఎండబెట్టుకునే పరిస్థితి నెలకొంది. నిష్పక్షపాతంగా



ఆత్మకూరులో సాగుకు సిద్ధం చేసిన పొలం

ఉండాల్సిన అధికారులు కొన్ని ప్రాంతాలకే నీటిని తరలించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**వారబందీతో చిక్కులు..**

ప్రభుత్వం వారబందీ పద్ధతిలో నీటిని వదలడానికి ప్రణాళికలు చేయగా అదే ఇప్పుడు రైతులకు శాపంగా మారింది. వారం రోజులు నీటిని వదిలినప్పటికీ ప్రధాన కాలువ వరకే నీరు వస్తోంది. ప్రధాన కాలువ సమీప గ్రామాల రైతులకు కొద్దిమందికే ఆ



నీటి కోసం ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

నీరు ఉపయోగపడుతున్నాయని, మిగతా రైతులు తమ పంటలు ఎండబెట్టుకోవాల్సి వస్తుందని పలువురు తెలుపుతున్నారు. నీళ్లు సరిగా అందక రైతులు గొడవలు పడుతున్న సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఎస్సారెస్పీ నీటి కోసం రైతులు ఆందోళనలు కూడా చేపట్టారు. ఇప్పటికైనా యాసంగి సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

**ఐదు ఎకరాలు పడావుపెట్టాను**



ఎస్సారెస్పీ నీళ్లు వస్తాయనుకొని పొలాన్ని సిద్ధం చేశాం. వారబందీ పద్ధతిలో నీళ్లు ఇస్తుండడంతో చివరి భూములకు అందడం లేదు. దీంతో నాటుకు సిద్ధం చేసిన 5 ఎకరాలను పడావుపెట్టాను. నాటుపెట్టిన తరువాత కూడా నీళ్ల కోసం తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– చందా క్రిష్ణమూర్తి, రైతు, ఆత్మకూర్

**ఆరు ఎకరాల్లో నష్టపోయా..**



వానాకాలంలో ఎస్సారెస్పీ నీళ్లు సక్రమంగా రాకపోవడంతో ఆరు ఎకరాల్లో పంట నష్టపోవాల్సివచ్చింది. వేసవిలోనూ వారబందీ పద్ధతిలో నీళ్లు వదులుతుండడంతో సక్రమంగా రావడంలేదు. అధికారులు అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– ఉప్పుల సైదులు, రైతు, ఆత్మకూర్

## వీరారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



యానాల వీరారెడ్డి స్మారకస్థూపం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

**నాగారం :** విప్లవోద్యమ నేత యానాల వీరారెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అవునూరి మధన్న అన్నారు. యానాల వీరారెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వర్ధమానుకోటలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా నాగారం ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే యానాల వీరారెడ్డి చిత్రపటానికి ఆయన తల్లి చంద్రమ్మ, ముఖ్య వక్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా నాయకులు జాజుల సామేల్, ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్, కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, దేసోజు మధు, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, అరుణోదయ రాష్ట్ర నాయకులు తడకమళ్ల సంజీవ, పోలేబోయిన లింగయ్య, మొగిళ్ల అంజయ్య, సోమయ్య, నాతి ఉప్పలయ్య, ఉమేష్, బోల్లే వెంకన్న, నర్సిరెడ్డి, పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, మండడి శ్రీధర్, మల్లయ్య, తోట్ల మహేందర్, బయన్న, కృష్ణమూర్తి, సైదులు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

**పెన్‌పహాడ్ :** గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, నకిరేకంటి వెంకన్న, లింగయ్య, అంజయ్య, కృష్ణయ్య, మట్టయ్య, సైదులు, సందీప్, శ్రీనివాస్, వీరస్వామి, లింగయ్య, సైదమ్మ, సోమయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి భుజంగరావు

## ఎస్–ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అంబయ్య

**నాగారం :** గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గుండగాని అంబయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాతృమూర్తి గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఎస్–ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువకులు, విద్యార్థులు క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఫౌండేషన్, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్క సైదులు, చిప్పపల్లి చిరంజీవి, కూరం వెంకన్న, కన్నెబోయిన భద్రయ్య, దేవరకొండ మురళి, సీహెచ్ బాలస్వామి, మల్లేష్, ఆకారపు శోభన్, పండు, అజయ్, కడియం పవన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



తుంగతుర్తి : బండరామారంలో ఎమ్మెల్యే సామేల్‌ను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

**తిరుమలగిరి :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు ఇవ్వడానికి కృషి చేస్తుందని, సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

**అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, ఎంపీడీఓ లాజరస్ పాల్గొన్నారు.

**మౌలిక వసతులు కల్పించాలని వినతి**

తిరుమలగిరిలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యుడు మందుల సామేల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాల్తా శ్రీనివాస్, పుల్లయ్య, ఆరిఫ్, దయాకర్, నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు బర్ల సోమేష్ మాతృమూర్తి బర్ల శాంతమ్మ ఇటీవల మృతి చెందారు. శుక్రవారం బండ్లపల్లిలో శాంతమ్మ చిత్ర పటానికి తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, సుంకరి జనార్దన్, దాచేపల్లి వెంకన్న, అంజయ్య తదితరులు ఉన్నారు.

**తుంగతుర్తి:** ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. శుక్రవారం బండరామారం గ్రామంలో నిర్వహించిన కంఠ మహేశ్వర స్వామి ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలతో ప్రజల్లో ఐకమత్యం పెంపొందుతుందన్నారు. అనంతరం గౌడ భక్తులు రేగటి రవి, వెంకటేష్‌లు ఎమ్మెల్యే సామేల్, రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం కమిటీ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దొంగరి గోవర్ధన్, గౌడ భక్తులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**

తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన తడకమళ్ల సుధాకర్ (43) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ శుక్రవారం మృతుడి భౌతికకాయన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఉప్పుల రాంబాబు, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయేతర భూముల పరిశీలన

**తిరుమలగిరి :** అనంతారం, మామిడాల గ్రామాల్లో వ్యవసాయేతర భూములను శుక్రవారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను మండల వ్యవసాయ అధికారులకు తెలియజేసి నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏఈఓలు లక్ష్మి, చైతన్య, సర్వేయర్ జోసఫ్ పాల్గొన్నారు.

**అర్వపల్లి :** భూముల సర్వేను శుక్రవారం జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి, కాసర్లపహాడ్ తదితర గ్రామాల్లో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ గణేష్, గిర్దావర్ ప్రసన్న, ఏఈఓ శోభారాణి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**భూముల సర్వే పరిశీలన**

తిమ్మాపురంలో రైతు భరోసా సర్వేను శుక్రవారం సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ రావు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ జలేందర్‌రావు, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఈఓ సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమలగిరి : మామిడాలలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవరావు

**మద్దిరాల :** వ్యవసాయేతర భూముల గుర్తింపు కోసం గ్రామాల్లో చేపట్టిన సర్వే శుక్రవారం రెండోవ రోజు కొనసాగింది. ముకుందాపురం గ్రామంలోని క్వారీ సమీపంలో నిర్వహిస్తున్న సర్వేలో తహసీల్దార్ అమీన్‌సింగ్ పాల్గొని భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ అనిషా రూహి, ఆర్ఐ వహీద్, ఏఈఓ ఆయూషా గ్రామస్తులు పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు



మద్దిరాల : ముకుందాపురంలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ అమీన్‌సింగ్

## హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలి



అర్వపల్లిలో అవగాహన కల్పిస్తున్న జై భారత్ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు వెంకన్న

**అర్వపల్లి :** హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని జై భారత్ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుండు వెంకన్న కోరారు. అర్వపల్లిలో శుక్రవారం జై భారత్ సంస్థ ఆధ్వర్యంలో హిందూ, ముసింల ఐక్యత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతం కేవలం వ్యక్తిగత జీవితంలో మాత్రమే ఉండాలని అన్నారు. కానీ మత భావాలను ప్రస్తుతం రాజకీయాల్లోకి తీసుకొస్తుండడంతో ఘర్షణలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం హిందూ, ముస్లింలు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో పూలే, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, దడిపల్లి వెంకట్, మహ్మద్ బాబు, అజీజుద్దీన్, సోమయ్య, షేక్ జాని, కట్టెల రాజు, శివ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

**అర్వపల్లి :** మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన పాలబిందెల రేణుక తండ్రి నారాయణ ఇటీవల మరణించారు. దీంతో ఆయన కూతురు రేణుక 10వ తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు శుక్రవారం తోటి స్నేహితురాలికి రూ.5,500 ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితురాలు రేణుక కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు కుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, బయ్య బాలచందర్, సూరారపు శ్రీను, మల్లయ్య, ఎం.శ్రీనివాస్, జనార్దన్, శ్రీదుర్గ, సరిత, ఉషశ్రీ, శైలజ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

**నూతనకల్ :** నూతనకల్ మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామానికి చెందిన గంట అవిలయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి గ్రామస్తులంతా కలిసి శుక్రవారం రూ.19500 ఆర్థికసాయం అందజేశారు. గతంలో కూడా గ్రామస్తులు పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లెడ జలందర్‌రెడ్డి, ప్రసాద్, బాదావత్ రంజిత్, పాండవుల లింగయ్య, బాణోతు రమేష్, అశోక్, అయోధ్య, మహేస్, రామకృష్ణ, మేడే ఎల్లయ్య పాల్గొన్నారు.



అర్వపల్లి : ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

## పీఎన్ఎం శిక్షణ తరగతులు

**చిలుకూరు :** మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం సీపీఎం అనుబంధ ప్రజా నాట్య మండలి (పీఎన్ఎం) జిల్లాస్థాయి శిక్షణ తరగతులను ఆ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాము కళారూపాలను ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ముందుగా పీఎన్ఎం జెండాను ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బచ్చలకూర రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, కందుల జయరాజ్, స్వరాజ్యం, నర్సింహారావు, కళాకారులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన వారికి సన్మానం

**కోదాడ :** పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల ఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారిని శుక్రవారం కోదాడలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. బలహీన వర్గాలకు చెందిన పులి వెంకటేశ్వర్లు, గుగులోత్ వెంకటేశ్వర్లు, ఎండీ ఇస్మాయిల్ కష్టపడి ఈ స్థాయికి చేరడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో పేదలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి చెరుకుపల్లి కిరణ్, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్, గంధం బుచ్చారావు, పులి శ్రీనివాస్, పంది కళ్యాణ్, చలిగంటి రామారావు, బజాన్, రఫీ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**మద్దిరాల :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మద్దిరాలలో శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన లింగయ్య తన సొంత ట్రాక్టర్ ద్వారా ఎలాంటి అనుమతి లేకుండా గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా మద్దిరాల సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని లింగయ్య, డ్రైవర్ యశ్వంత్‌పై కేసు నమోదు చేశారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**మోతె :** మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. హుస్సేన్‌బాద్‌లో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, గోల్‌తండాలో రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సర్వారంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఉర్లుగొండ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులు, నర్సింహాపురంలో పశువుల కొట్టాల నిర్మాణ పనులు ప్రారంభించారు. రావికుంటతండాలో రూ. 2 లక్షలు, బోడబండ్లగూడెంలో రూ. 3 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.



పనులను ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

## రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



తుంగతుర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది

**సూర్యాపేటటౌన్ :** అతి వేగం ప్రమాదకరమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సూర్యాపేటలో స్థానిక ఖమ్మం ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని తెలిపారు. ఓవర్ టేకింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌లోడు తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలియజేశారు. వాహనదారుల నిర్లక్ష్యంతోనే రోజు రోజుకూ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**తుంగతుర్తి :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ కాగితాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భగవాన్, వాహనదారులు తాటికొండ సీతయ్య, మల్లేష్, వెంకన్న, మల్లయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్ : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

## గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**కోదాడరూరల్ :** గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్న వ్యక్తిని శుక్రవారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోదాడ పట్టణ స్టేషన్ కార్యాలయం ఆవరణలో సీఐ రాము కేసు వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం ద్విచక్రవాహనాలను, ఇళ్లల్లోని గ్యాస్ సిలిండర్లను దొంగలించి అమ్ముకుంటున్నాడు. పట్టణ సీఐ రంజిత్ ఆధ్వర్యంలో గుడిబండ రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కాలనీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై గ్యాస్ సిలిండర్‌తో వస్తున్న శ్రీకాంత్ పోలీసులను చూసి పరారు అవుతుండగా అతన్ని పట్టుకున్నారు. శ్రీకాంత్‌ను విచారించగా పట్టణంలో రెండు ద్విచక్రవాహనాలతో పాటు సాయినగర్, ఉత్తమ్‌పద్మావతినగర్, గోపిరెడ్డినగర్, భవానీనగర్, అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 39 సిలిండర్లను చోరీ చేసి అమ్మినట్లు ఒప్పుకున్నాడు. వాటిలో 23 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని, వాటిని కొనుగోలు చేసిన పలువురికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇంతకుముందు అతనిపై పలు చోట్ల 11 కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. సీఐ రాము, ఎస్ఐలు రంజిత్‌రెడ్డి, సైదులుతో పాటు సిబ్బందిని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.



పట్టుబడిన గ్యాస్ సిలిండర్లను చూపిస్తున్న సీఐ రాము